సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం । 18 । ఆగస్టు । 2024



తోడుగా.. రక్షగా..


కష్టాల్లో తోడూనీడగా... అనుబంధానికి ప్రతి రూపంగా.. యోగక్షేమాలు తెలుసుకుంటూ.. ఆప్యాయత పంచుతూ.. తోబుట్టువుల బంధాన్ని శాశ్వతంగా నిలిపేదే రక్షాబంధన్. - 8లో



త్వరలోనే ప్రభాస్‌తో స్పిరిట్

ప్రముఖ సినీ హీరో ప్రభాస్‌తో త్వరలోనే స్పిరిట్ సినిమా ప్రారంభమవుతుందని సినీ దర్శకుడు సందీప్‌రెడ్డి స్పష్టం చేశారు. - 8లో

2.05 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి శనివారం సాయంత్రం 2,05,864 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. కాటన్ బ్యారేజ్ వద్ద 10.80 అడుగులకు నీటి మట్టం చేరింది. ఖరీఫ్ సాగు కోసం డెల్టా కాలువలకు 14,100క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

కిడ్నీ బాధితుడికి రూ.లక్ష సాయం



రవీంద్రకు ఆర్థిక సాయం అందజేస్తున్న పల్లం అగ్నికుల క్షత్రియ యువత

కాట్రేనికోన: పి.గన్నవరం నియోజకవర్గం లంకల గన్నవరం డొక్కా సీతమ్మ కాలనీకి చెందిన కొల్లు రవీంద్ర (21) రెండు కిడ్నీలు పాడై మంచాన పడ్డాడు. ఈ విషయం సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న ముమ్మిడివరం నియోజకవర్గం పల్లం గ్రామానికి చెందిన అగ్నికుల క్షత్రియ యువత సాయం అందించారు. నిరుపేద కుటుంబానికి అండగా ఉండాలనే తపనతో స్నేహితులంతా కలసి రూ.లక్ష సేకరించి అందజేశారు. ఆర్థిక సహాయం అందించిన యువకుల్లో అవనిగడ్డ నారాయణమూర్తి, మల్లాడి దయ, అవనిగడ్డ శ్రీరాములు, బొమ్మిడి శ్రీరాములు, రాజు, శంకర్, నాయకర్, రామరాజు, వీరబాబు తదితరులు ఉన్నారు.

జిల్లా ఏఎస్పీగా ప్రసాద్



జిల్లాకు బదిలీపై రానున్న ఏఎస్పీ ప్రసాద్

అమలాపురం టౌన్: జిల్లా ఏఎస్పీ (అడ్మిన్)గా ఏవీఆర్‌పీబీ ప్రసాద్ బదిలీపై వస్తున్నారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఏఎస్పీగా పనిచేసిన ఎస్.ఖాదర్ బాషాకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. బాషాను మంగళగిరిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశాలు వచ్చాయి. నెల్లూరు జిల్లా క్రైం విభాగం ఏఎస్పీగా పనిచేస్తున్న ప్రసాద్ జిల్లాకు వస్తున్నారు. ఆయన రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని స్థానిక ఎస్పీ కార్యాలయం పేర్కొంది. ఇక్కడ పనిచేసిన ఏఎస్పీ బాషా ఏడాదిన్నర కిందట బాధ్యతలు చేపట్టారు. కోనసీమ జిల్లా ఏర్పాటయ్యాక ప్రసాద్ మూడో ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

చవితి ఏర్పాట్లకు శ్రీకారం

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో వచ్చే నెల 7 నుంచి 15 వరకూ నిర్వహించే వినాయక చవితి మహోత్సవాలకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శనివారం శ్రీకారం చుట్టారు. ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు, ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి మంత్రోచ్ఛారణల మధ్య ఎమ్మెల్యే ఉత్సవాలకు నాంది పలికారు. గ్రామ సర్పంచ్ కాకర శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ ఆలయంలో భక్తుల సందడి



అప్పనపల్లిలో బాలాజీ స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయం శ్రావణ మాసం సందర్భంగా శనివారం భక్తులతో సందడిగా మారింది. తొలుత పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేశారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.3,17,707 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. ఇందులో లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,30,798, నిత్యాన్నదాన ట్రస్టుకు భక్తులు రూ.86,909 విరాళంగా అందించారు. 3,671 మంది స్వామి వారిని దర్శించుకోగా, 2,948 మంది అన్నప్రసాదం స్వీకరించారు. స్వామివారి నిత్యాన్నదాన ట్రస్టుకు పాశర్లపూడి బాడవకు చెందిన కాండ్రేగుల వెంకటేశ్వరరావు, సూర్యావతి దంపతులు రూ.11,111 విరాళంగా సమర్పించారు.

ఇలా ఇసుకిస్తారా!

- ఉచిత ఇసుక నిల్
- జిల్లాలో ఆరు స్టాక్ పాయింట్లు
- మిగిలింది అరకొర నిల్వలే
- అదీ పీఆర్ అప్పగించామంటున్న అధికారులు
- వరదతో అక్టోబర్ 15 వరకూ ర్యాంపుల్లో సేకరణ కష్టమే
- నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం



కపిలేశ్వరపురంలో ఇసుక స్టాక్ పాయింట్

- కపిలేశ్వరపురం స్టాక్ పాయింట్ వద్ద 60,188 మెట్రిక్ టన్నుల ఇసుక అమ్మకాలు జరిపారు. ఇప్పుడు కొద్దిపాటి నిల్వలు మాత్రమే ఉన్నాయి. మరో రెండు రోజుల్లో ఈ నిల్వలూ పూర్తి కానున్నాయి.
- ఆలమూరు మండలం జొన్నాడ స్టాక్ పాయింట్ వద్ద 10,590 మెట్రిక్ టన్నుల ఇసుక ఉండగా, జిల్లాలో తొలి స్టాక్ పాయింట్ ఇదే. అయితే ఇసుక అమ్మకాలు పూర్తయ్యాయి. ఇప్పుడున్న కొద్దిపాటి ఇసుక మట్టిలో కలిసిపోయింది.

సాక్షి, అమలాపురం/ రావులపాలెం/ కొత్తపేట/ కపిలేశ్వరపురం/ ఆలమూరు: ఇసుక కంటికి కనిపించడం లేదు.. ఎక్కడా దొరికే పరిస్థితి లేదు.. నిల్వలు లేక స్టాక్ పాయింట్లు తెరిచే పరిస్థితి లేదు. కొద్దిపాటి నిల్వలను సైతం ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తామని అధికారులు చెబుతుండడంతో ఇసుక దొరకడం లేదు. ఇదే సమయంలో గోదావరి వరద నీటి ప్రవాహం కారణంగా అక్టోబర్ 15 వరకూ ఇసుక తవ్వకాలు చేసే అవకాశాలు కనిపించడం లేదు. ఈ ప్రభావం నిర్మాణ రంగంపై పడుతోంది. కార్మికుల ఉపాధికి గండి కొడుతోంది.

మొదలు పెట్టే సమయానికి..

కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ మొదలు పెట్టే సమయానికి జిల్లాలో ఆరు స్టాక్ పాయింట్లలో 2,44,131 మెట్రిక్ టన్నుల ఇసుక ఉందని తేల్చారు. రావులపాలెం-1 స్టాక్ పాయింట్‌లో 33,888 మెట్రిక్ టన్నులు, రావులపాలెం-2లో 82,089, కొత్తపేట (మందపల్లి) 25,898, జొన్నాడ 10,590, తాతపూడి 31,478, కపిలేశ్వరపురంలో 60,188 మెట్రిక్ టన్నుల చొప్పున నిల్వలు ఉండగా, ప్రభుత్వం ఇక్కడి నుంచి ఇసుక అమ్మకాలు చేపట్టింది. కానీ అంతకు ముందే అంటే ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుసటి రోజు నుంచే రావులపాలెం-1, 2, మందపల్లి ఇసుక స్టాక్ పాయింట్ల నుంచి దొడ్డిదారిన టన్నుల కొద్దీ ఇసుకను తరలించుకుపోయారు. కపిలేశ్వరపురం మండల పరిధి తాతపూడి వద్ద కూడా ఇలా కొల్లగొట్టేందుకు ప్రయత్నించగా స్థానికులు తిరగబడడంతో నిలిచిపోయింది. తరువాత గుర్తించిన నిల్వలను ప్రభుత్వం ఉచితం పేరుతో టన్నుకు రూ.265 చొప్పున వసూలు చేసి అమ్మకాలు చేసిన విషయం తెలిసిందే. పేరుకు ఉచిత ఇసుకే కానీ టీడీపీ ప్రజాప్రతినిధుల పేరున ట్యాక్స్‌లు, లారీల యజమానులు రెట్టింపు చేసి రవాణా చార్జీలు వసూలు చేయడంతో ఉచిత ఇసుక కాస్తా వినియోగదారులకు మోయలేని భారంగా మారింది.

అప్పటి వరకూ ఇంతే..

ఇప్పటికీ గోదావరిలో వరద నీరు ప్రవహిస్తోంది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి శనివారం సాయంత్రం ఆరు గంటల సమయంలో 2,02,483 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఎగువన క్యాచ్‌మెంట్ ఏరియాలో ఇంకా వర్షాలు పడే అవకాశముంది. సహజంగా గోదావరికి ఆగస్టులోనే పెద్ద వరదలు వస్తుంటాయి. అక్టోబర్ 15 వరకూ ఇదే పరిస్థితి ఉంటోంది. దీనివల్ల ర్యాంపులు నిర్వహించే అవకాశం తక్కువ. అప్పటి వరకూ ర్యాంపుల నుంచి ఇసుక తీయడం దాదాపు అసాధ్యమనే చెప్పాలి.

ముందుచూపు లేకుండా..

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ 4న వచ్చాయి. అప్పటి వరకూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యగా ఎంపిక చేసిన స్టాక్ పాయింట్లలో భారీగా ఇసుక నిల్వ చేసింది. కూటమి ప్రభుత్వం, అధికార టీడీపీ ఎమ్మెల్యేలు ఆ నిల్వలను కొల్లగొట్టుకుని జేబులు నింపుకోవాలని చూశారే తప్ప గోదావరి వరదలు వస్తే మూడున్నర నెలల పాటు ఇసుక సేకరణ ఇబ్బంది అవుతోందనే ధ్యాస లేకుండా పోయింది. గోదావరికి జూలై 20 తరువాత కాని వరద రాలేదు. అప్పటి వరకూ ఇసుక సేకరించే అవకాశమున్నా కొత్త ప్రభుత్వం గుర్తించ లేదు. దీనివల్ల ఇప్పుడు కొరత వేధిస్తోంది.

నిర్మాణ రంగంపై ప్రభావం

జిల్లాలోని స్టాక్ పాయింట్లలో ఇసుక లేదు. ర్యాంపులు అప్పుడే తెరుచుకోక ఇసుకకు కొరత ఉండనుంది. పట్టణాలు, అభివృద్ధి చెందిన గ్రామాల్లో అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ భవనాలు నిర్మించేవారు ముందుగానే ఈ పరిస్థితి ఊహించి ఇసుక నిల్వ చేసుకున్నారు. కానీ సామాన్యులు, మధ్య తరగతి కుటుంబాలు ఇసుక నిల్వ చేయలేదు. ఇసుక కొరత ప్రభావం వీరిపై అధికంగా పడనుంది. నిల్వలు అడుగంటినందున ఇసుకకు మరింత డిమాండ్ వచ్చిన తరువాత ఇప్పుడు పంచాయతీరాజ్ శాఖకు అప్పగిస్తామని చెబుతున్నారు. ఈ ఇసుకను సైతం తెలుగు తమ్ముళ్లు దొడ్డిదారిన విక్రయించే అవకాశముందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు నిఘా ఉంచాలనే డిమాండ్ ఉంది.

ఇక నో స్టాక్..



రావులపాలెం-1 స్టాక్ పాయింట్‌లో నిండుకున్న ఇసుక నిల్వలు

రావులపాలెం-1 స్టాక్ పాయింట్‌లో 33,888 మెట్రిక్ టన్నుల ఇసుక ఉన్నట్టు మొదట్లో అధికారులు చెప్పారు. దాదాపు ఇక్కడ అమ్మకాలు పూర్తయ్యాయి. అధికారికంగా ఇసుక మొత్తం ఖాళీ అయ్యింది. అదనంగా ఏమీ లేదు. ఎటువంటి విక్రయాలూ జరగడం లేదు.

ఉన్నది పోగు చేస్తూ..



రావులపాలెం స్టాక్ పాయింట్-2లో జేసీబీతో సేకరిస్తున్న మిగులు ఇసుక

రావులపాలెం-2లో ప్రభుత్వం 82,089 మెట్రిక్ టన్నుల ఇసుక ఉన్నట్టు చెప్పింది. వాస్తవంగా ఇంతకన్నా అధికంగానే ఇక్కడ ఇసుక ఉందని అప్పట్లో పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుతం ఇక్కడ కేవలం 600 టన్నుల మాత్రమే ఉంది. ఉన్న కొద్దిపాటి ఇసుకను పోగు పెడుతున్నారు. అయితే కొబ్బరి ఆకులు, డస్టు పౌడర్ వస్తుండడంతో ఇది ఇళ్ల కట్టుబడికి పనికి రాదని చెబుతున్నారు. వచ్చే కొద్దిపాటి ఇసుకను పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఉంచుతామని అధికారులు వివరించారు.

అభివృద్ధికని చెబుతూ..



మందపల్లి స్టాక్ పాయింట్‌లో ఇలా..

కొత్తపేట మండలం మందపల్లి వద్ద ఉన్న ఈ స్టాక్ పాయింట్‌లో 25,898 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. ఇక్కడ అమ్మకాలు దాదాపుగా పూర్తయ్యాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక కొత్తపేట ఇసుక స్టాక్ పాయింట్ నుంచి ఇసుకను టీడీపీ నాయకులు అక్రమంగా తరలించారు. ఇంకా 1,200 టన్నుల మిగిలిన ఇసుకను అభివృద్ధి కార్యక్రమాల కోసం నిల్వ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇది కాకుండా మరో వెయ్యి టన్నుల ఇసుక స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఖాళీ స్థలంలో నిల్వ చేశారు.

అమలాపురంలో ఐఎంఏ వైద్యుల నిరసన

కోల్‌కతాలో వైద్యురాలి హత్యపై ఖండన



కలెక్టర్ మహేష్ కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న జిల్లా ఐఎంఏ వైద్య ప్రతినిధులు

అమలాపురం టౌన్: కోల్‌కతాలో వైద్యురాలిపై లైంగిక దాడి, ఆపై హత్య చేసిన ఘటనపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో వైద్యులు నిరసన తెలిపారు. శనివారం జిల్లాలోని వైద్యులు తమ విధులను బహిష్కరించి అమలాపురంలో నిరసన ప్రదర్శన చేశారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌కు జిల్లా నలుమూలల నుంచి వైద్యులు చేరుకుని కోల్‌కతా ఘటనను తీవ్రంగా ఖండించారు. వైద్యురాలిపై ఆటవికంగా లైంగిక చేసి, అతి కిరాతంగా హత్య చేసిన తీరుపై ఐఎంఏ వైద్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో దోషులను తక్షణమే శిక్షించాలని నినాదాలు చేశారు. తొలుత గడియార స్తంభం సెంటర్‌లో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత ధర్నా నిర్వహించారు. అక్కడి నుంచి ప్రదర్శనగా కలెక్టరేట్ వరకూ చేరుకున్నారు. కలెక్టరేట్‌కు ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వైద్యులు పూలమాలలు వేశారు. అనంతరం కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్‌ను కలసి ఇటీవల కాలంలో వైద్యులపై పెరుగుతున్న దాడులను వివరించారు. దాడులు అరికట్టకపోతే తాము వైద్య సేవలు అందించలేమని వివరించారు. ఐఎంఏ జిల్లా శాఖ అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్ మూర్తి, కార్యదర్శి డాక్టర్ కడలి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో వైద్యులు పీఎస్ శర్మ, గొలకోటి రంగారావు, బి.రాఘవేంద్రరావు, జి.ప్రభాకర్, పయ్యావుల సురేష్, గిరిజా, రమాదేవి, దీపిక తదితరులు పాల్గొన్నారు. వైద్యుల నిరసన శిబిరాన్ని పట్టణ సీఐ కె.క్రిష్టోఫర్ సందర్శించారు. వైద్యులపై జరుగుతున్న దాడులపై చట్ట ప్రకారం తీసుకునే చర్యలను ఆయన వివరించారు. నిరసన ప్రదర్శన అనంతరం స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లో దాడుల నుంచి వైద్యులు ఎలా రక్షణ పొందాలి, దాడులకు పాల్పడే వ్యక్తులను చట్టప్రకారం శిక్షించే అంశాలపై ఐఎంఏ వైద్యులు మాట్లాడారు.


స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ప్రారంభం



రాజోలు మండలం కడలి కాంప్లెక్స్‌లో టీఎల్‌ఎం ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

రాయవరం: ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలను పెంచేందుకు ఉద్దేశించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. ఇకపై ప్రతి నెలా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు సబ్జెక్టు కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు 50 శాతం మంది పాల్గొనగా, సబ్జెక్టు కాంప్లెక్స్ సమావేశాల్లో భాగంగా తెలుగు, గణితం, బయలాజికల్ సైన్స్ సబ్జెక్టు ఉపాధ్యాయులకు సమావేశాలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 22 మండలాల్లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు 47, తెలుగు, గణితం, బయలాజికల్ సైన్స్ సబ్జెక్టు కాంప్లెక్స్ ఉపాధ్యాయులకు 21, వ్యాయామ ఉపాధ్యాయులకు 7 స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. వీటిని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి పర్యవేక్షించారు.

విజన్ కార్యాచరణ తయారు చేయాలి



జిల్లా ప్రణాళిక సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా వికసిత్ ఆంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు వచ్చే ఐదేళ్లకు జిల్లా కార్యాచరణ తయారు చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం అమలాపురం కలెక్టరేట్‌లో శాఖల వారీగా జిల్లా యాక్షన్ ప్లాన్ రూపొందించే అంశంపై కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారులందరికీ ఈ నెల 21 నుంచి 31 వరకూ రాష్ట్ర స్థాయిలో సంబంధిత హెచ్ఓడీల సమావేశాలు నిర్వహించి, తమ శాఖల ప్రణాళికను రూపొందించడానికి దిశానిర్దేశం చేస్తారన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, సీపీఓ వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ శివశంకర ప్రసాద్, డ్వామా పీడీ మధుసూదన్, అగ్రికల్చర్ జేడీ బోసుబాబు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌లు నిర్మించుకోవాలి

పేద, మధ్యతరగతి కుటుంబాలు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన కింద తమ ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్‌లను నిర్మించుకోవడం ద్వారా 300 యూనిట్ల వరకూ విద్యుత్తును ఆదా చేసుకోవచ్చని కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన క్యూఆర్ కోడ్ సెల్ఫీ స్టాండ్‌ను ఆయన పరిశీలించారు. క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసి ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన కింద రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఒక కిలో వాట్ సామర్థ్యం గల సోలార్ ప్యానల్‌లను ఏర్పాటు చేసుకుంటే రూ. 30 వేల వరకూ రాయితీ అందిస్తుందని, రెండు కిలోవాట్ల సామర్థ్యానికి రూ. 60 వేలు, మూడు కిలోవాట్లకు గరిష్టంగా రూ.78 వేల వరకూ రాయితీ అందిస్తుందన్నారు. ఈ పథకం కింద సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవడానికి అతి తక్కువ వడ్డీకే బ్యాంకుల నుంచి రుణాలు లభిస్తాయన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

క్లుప్తంగా

రైలు కిందపడి ఆత్మహత్య



మృతి చెందిన భానుపద్మేశ్వరరావు

తుని: రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ శనివారం తెలిపారు. ఆ వివరాల్లో కెళ్తే.. తుని మండలం సూరవరం గ్రామానికి చెందిన వజ్రపు భాను పద్మేశ్వరరావు (19) ఇంట్లో ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో చనిపోవాలనే నిర్ణయానికి వచ్చాడు. స్థానిక రైల్వే పెద్ద గేటు సమీపంలో తుని నుంచి అన్నవరం వైపు వెళ్తున్న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

శృంగార వల్లభునికి రూ.2.69 లక్షల ఆదాయం



భక్తుల నుంచి పూజలందుకున్న శృంగారవల్లభ స్వామి వారు

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. శనివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముందస్తు ఏర్పాట్లు చేశారు. ఆలయంలో వివిధ సేవల టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామికి 2,68,814 రూపాయలు ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. సుమారు 12 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారని, సుమారు నాలుగు వేల మంది భక్తులు అన్నదానం స్వీకరించారని పేర్కొన్నారు.

తోడుగా.. రక్షగా..



- అప్యాయతకు ప్రతీక రక్షాబంధన్
- తోబుట్టువుల అనురాగాలకు సూచిక
- రేపు రాఖీ పండగ

రాయవరం: కష్టాల్లో తోడునీడగా... అనుబంధానికి ప్రతిరూపంగా.. యోగక్షేమాలు తెలుసుకుంటూ.. ఆప్యాయత పంచుతూ.. తోబుట్టువుల బంధాన్ని శాశ్వతంగా నిలిపేదే రక్షాబంధన్. అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల ఆత్మీయతకు నిర్వచనమే రాఖీ పండగ. ఇది సోదరి, సోదరుని మధ్యన ప్రేమానుబంధానికి ప్రతీక. ఈ నెల 19వ తేదీ సోమవారం శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమి తిథి కావడంతో రాఖీ పౌర్ణమిని తోబుట్టువులు ఆనందోత్సాహాలతో జరుపుకొనేందుకు సిద్ధమవుతున్నారు. పండగ రోజు పుట్టిళ్లు సందడిగా మారనున్నాయి. అక్కాచెల్లెళ్లు కట్టిన రాఖీలతో సోదరుల చేతులు వివిధ రంగులు, డిజైన్ల రాఖీలతో కళకళలాడనున్నాయి. అండగా ఉంటామని హామీ ఇస్తూ అన్నదమ్ములు తమకు తోచిన కానుకలు సోదరీమణులకు ఇస్తారు. రక్షా బంధన్‌ను రాఖీ పౌర్ణమి.. జంధ్యాల పౌర్ణమిగా పిలుస్తారు. విద్యార్థినీ విద్యార్థులు, యువతీ యువకుల మధ్య సోదరభావం, నైతిక విలువలు పెరిగేందుకు ఇది దోహపడుతోంది. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ పెరుగుతున్న పరిస్థితుల్లో కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థి సంఘాలు ఈ పండగను ఘనంగా నిర్వహించేందుకు చొరవ చూపాలి.



ఆకట్టుకుంటున్న రాఖీ

మహాలక్ష్మి స్వరూపంగా..

ఆడ పడుచును మహాలక్ష్మి స్వరూపంగా, పరాశక్తికి ప్రతీకగా భావించే సంస్కృతి మనది. కష్ట సుఖాల్లో భరోసాను అక్కాచెల్లెళ్లకు కల్పించడమే రాఖీ బంధం. సోమవారం జిల్లా వ్యాప్తంగా రాఖీ పౌర్ణమిని ఘనంగా నిర్వహించుకొనేందుకు సోదర సోదరీమణులు సన్నద్ధమవుతున్నారు. శ్రావణమాసంలో పౌర్ణమి రోజున వచ్చే ఈ పర్వదినాన్ని జంధ్యాల పౌర్ణమిగా పిలుస్తుంటారు. తమిళనాడులో పూనూల్‌పర్వగా, కేరళలో ఆవని ఆవిట్టంగా పిలుస్తుంటారు. ఉత్తరాదిలో రక్షాబంధన్‌గా పిలవడం పరిపాటి. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం (ఓంశాంతి) ప్రతినిధులు రాఖీ పండగను ఆధ్యాత్మిక విశిష్టతగలదిగా భావిస్తారు. తమ కార్యాలయాల్లో ఆధ్యాత్మిక కార్యకలాపాలు నిర్వహిస్తారు. ప్రభుత్వ అధికారులు, రాజకీయ ప్రముఖులతో పాటు ఇతర రంగాల ప్రముఖులకు కూడా పండగ రోజు బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టడం ఆనవాయితీగా వస్తోంది.



విక్రయానికి సిద్ధంగా ఉన్న రాఖీలు

మార్కెట్‌లో కళకళ

రాఖీ పండగను పురస్కరించుకుని మార్కెట్‌లోని పలు ఫ్యాన్సీ షాపుల్లో సంప్రదాయ, ఆధునిక రాఖీలు కనువిందు చేస్తున్నాయి. వ్యాపారులు రంగురంగుల రాఖీలను అమ్మకాలకు పెట్టారు. ముఖ్యంగా పిల్లలను ఆకర్షించే వివిధ కామిక్ రాఖీలను ఎక్కువగా విక్రయిస్తున్నారు. మరికొన్ని బంగారు బ్రాస్‌లెట్‌లను తలపిస్తూ ధగధగలాడుతున్నాయి. రుద్రాక్ష, ప్లాస్టిక్, పూల రాఖీలు, రంగు పూసల రాఖీలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఇవి కాలానుగుణంగా కొత్త డిజైన్లలో వస్తున్నాయి. గతంతో పోల్చితే విక్రయాలు పెరుగుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. రూ.10 నుంచి రూ.వేల ధరల్లో లభ్యమవుతున్నాయి.



రామచంద్రపురంలో రాఖీలు కొనుగోలు చేస్తున్న అక్కాచెల్లెళ్లు

ఆన్‌లైన్‌లో కానుకలు

కాలం మారడంతో పాటు రక్షా బంధన్ తీరు మారింది. విద్య, ఉపాధి, ఇతరత్రా కారణాలతో దూర ప్రాంతాల్లో ఉంటున్న సోదరులకు పోస్టు ద్వారా రాఖీలను పంపితే వాటిని కట్టుకొని తోబుట్టువులకు కానుకలు పంపే సంప్రదాయాన్ని పాటిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా పరస్పరం అభినందనలు తెలుపుకొంటూ ఆనందాన్ని పంచుకుంటున్నారు. పద్ధతులు మారినా రాఖీ అనుబంధం, ఆప్యాయత మాత్రం చెక్కు చెదరలేదు.

అన్నంటే ప్రాణం



నాకు సొంత అన్నయ్యలు లేరు. నా కజిన్స్ అంతకంటే ఎక్కువగా భావిస్తాను. ఏటా మా అన్నకు రాఖీ కడతాను. ఎంత దూరాన ఉన్నా మా అన్న నా దగ్గరకు వచ్చి రాఖీ కట్టించుకొని వెళ్తాడు. అన్ని పండగల్లో అన్నాచెల్లెల గురించి తెలియజేసే పండగ ఇదే. ఎంత వయసు వచ్చినా అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ఏదీ సాటిరాదు.

–ఆర్.కృష్ణమాధురి, మండల లెవిల్ అకౌంటెంట్, విద్యాశాఖ కార్యాలయం, మండపేట

కష్ట సుఖాల్లో తోడుండేవాడే..



కష్ట సుఖాల్లో తోడుగా నిలిచి, మన శ్రేయస్సు కోరుకునే వారే సోదరులు. నా అన్నయ్యలు ఎప్పుడూ నాకు వెన్నంటే నిలిచారు. రాఖీ పండగ వస్తుందంటే నా కంటే ఎక్కువగా అన్నయ్యలు సంతోషపడతారు. ఎంతదూరాన ఉన్నా రాఖీ పండగకు తప్పనిసరిగా ఇంటికి వచ్చి ఆశీర్వదించి వెళ్తారు. వారి ప్రేమాభిమానాలు ఎప్పటికీ నిలిచి ఉండాలని కోరుకుంటాను.

–షేక్ కరీమున్నీసా బేగం, పసలపూడి, రాయవరం మండలం

గోవిందా.. హరి గోవింద



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి

- వాడపల్లికి ఆధ్యాత్మిక శోభ
- పెరిగిన భక్తుల రద్దీ



ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

ఆత్రేయపురం: గోవిందా.. హరి గోవింద నామస్మరణ మార్మోగింది. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం కిక్కిరిసింది. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. వేద పండితులు, అర్చకులు పువ్వుల రాయుడు వేంకటేశ్వర స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించారు. భక్తులు తలనీలాలు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఏడు శనివారాల నోము ఆచరిస్తున్న భక్తులు ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు స్వామివారి దర్శనానికి కాలినడకన వచ్చారు. ఆలయ ఆవరణలో వేలాది మందికి అన్నసమారాధన జరిగింది. ఈ ఏర్పాట్లను దేవదాయ ధర్మదాయశాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ పర్యవేక్షించారు. అలాగే పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయం, ఆత్రేయపురం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

మందపల్లిలో శని త్రయోదశి పూజలు



మందపల్లి శనైశ్చరాలయంలో భక్తుల పూజలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమామందేశ్వర (శనైశ్చర) స్వామి వారిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్వామికి ప్రీతికరమైన శనివారంతో పాటు త్రయోదశి పర్వదినం కలసి రావడంతో ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంతో పాటు ఆలయం వెనుక షెడ్లలో భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. దేవదాయ, ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో భక్తుల పూజలు, దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా పూజలు, తైలాభిషేకాల టిక్కెట్ల ద్వారా దేవస్థానానికి రూ.13,89,710, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.57,700 ఆదాయం వచ్చిందని ఈఓ విజయలక్ష్మి తెలిపారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ దంపతులు మందపల్లి శనైశ్చరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు, తైలాభిషేకం చేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం కలెక్టర్ దంపతులకు దేవస్థానం తరఫున స్వాగతం పలికారు. పూజాధికాల అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందించి, శాలువాతో సత్కరించారు. స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ, తహసీల్దార్ వై.రాంబాబు, ఆర్‌ఐ కె.ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

త్వరలోనే ప్రభాస్‌తో స్పిరిట్



మాట్లాడుతున్న సినీ దర్శకుడు సందీప్‌రెడ్డి

రాజానగరం: ప్రముఖ సినీ హీరో ప్రభాస్‌తో త్వరలోనే స్పిరిట్ సినిమా ప్రారంభమవుతుందని సినీ దర్శకుడు సందీప్‌రెడ్డి స్పష్టం చేశారు. అర్జున్‌రెడ్డి, కబీర్‌సింగ్, యానిమల్ చిత్రాలు తీసి హిట్ కొట్టి ఫామ్‌లో ఉన్న ఆయన స్థానిక జీఎస్‌ఎల్ వైద్య కళాశాల ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన స్వతంత్ర్య ఆసుపత్రి 38వ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనతో 'సాక్షి' ముచ్చటించింది. ఆ వివరాలు ఇలా..

ప్రశ్న: మీరు తీసే సినిమాల్లో వైద్యానికి సంబంధించి అంశాలే ఎక్కువగా ఉంటున్నాయి. దానికి కారణాలేంటి?

సందీప్‌రెడ్డి: ఫిజియోథెరపీ కోర్సు చేసిన నేను కొంతకాలం ప్రాక్టీస్ కూడా చేశాను. అందువల్ల ఆ ఛాయలు సినిమాల్లో కాస్త డీప్‌గా కనిపిస్తుంటాయి.

ప్రశ్న: వైద్య రంగంలో ఉన్న మీరు సినిమా రంగం వైపు ఎందుకు వెళ్లారు?

సందీప్‌రెడ్డి: విద్యార్థి దశ నుంచి ఎందుకో సినిమాలపై ఎక్కువగా ఆసక్తి ఉండేది. సినిమా తీసే విధానాన్ని నిశితంగా పరిశీలించే వాడిని. అందుకే ఫిజియోథెరపిస్టుగా ప్రాక్టీసు చేసే సమయంలోనే సినీ రంగం వైపు అడుగులు పడ్డాయి.

ప్రశ్న: తదుపరి సినిమాల గురించి చెబుతారా..!

సందీప్‌రెడ్డి: ప్రభాస్ హీరోగా 'స్పిరిట్' సినిమా షూటింగ్ త్వరలోనే ప్రారంభమవుతుంది.

ప్రశ్న: మహేష్‌బాబుతో సినిమా అన్నారు, ఎప్పుడు చేస్తారు?

సందీప్‌రెడ్డి: ప్రస్తుతం అందుకు సమయం లేదు. స్పిరిట్ సినిమా తరువాత యానిమల్– 2కి వెళ్తాం. ఈ రెండింటికీ కనీసం నాలుగేళ్లు పడుతుంది. ఆ తరువాతే ఏదైనా ఉంటుంది.

ప్రశ్న: వైద్య విద్యార్థులకు మీరిచ్చే సందేశం ఏంటి?

సందీప్‌రెడ్డి: సినిమాల ద్వారానే నా సందేశం ఏంటో చెబుతూనే ఉన్నాను. ఏదేమైనా చేసే పనిపై ఫోకస్ పెట్టాలి. అప్పుడే సరైన ఫలితాలను అందుకోగలుగుతాం.

సాధారణ బదిలీలకు పచ్చజెండా

- ప్రభుత్వ జీవో విడుదల
- 15 శాఖలలో బదిలీలకు చర్యలు

రాయవరం: ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. బదిలీల షెడ్యూల్, మార్గదర్శకాలతో జీఓ 75ను విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ఈ బదిలీలు జరగనున్నాయి. అయితే బదిలీలను కేవలం 15 శాఖలకే పరిమితం చేశారు. రెవెన్యూ (ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్), పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఇన్‌క్లూడింగ్ సెర్ప్), మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, జీవీడబ్ల్యూవీ అండ్ వీఎస్‌డబ్ల్యూఎస్, సివిల్ సప్లయిస్, మైనింగ్ అండ్ జియాలజీ, ఇంజినీరింగ్ స్టాఫ్ ఇన్ ఆల్ డిపార్ట్‌మెంట్స్, దేవదాయ, రవాణా, పరిశ్రమలు, స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్, కమర్షియల్ టాక్స్, ఎక్సైజ్, ఈఎఫ్‌ఎస్ అండ్ టీ శాఖల్లో బదిలీలు జరగనున్నారు. ఈ ఏడాది జూలై 31 నాటికి ప్రస్తుతం పనిచేస్తున్న చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి తప్పనిసరిగా బదిలీ ఉంటుంది. మిగిలిన వారు జీరో సర్వీస్‌పై రిక్వెస్ట్ బదిలీకి అర్హులవుతారు.

ఉద్యోగ సంఘాల నేతలకు మాత్రం బదిలీ ఒకే స్థానంలో తొమ్మిదేళ్ల వరకూ మినహాయింపు ఉంటుంది. ఈ నెల 19 నుంచి ఈ నెల 31వ తేదీ వరకూ బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేశారు. తిరిగి సెప్టెంబర్ 1వ తేదీ నుంచి బదిలీలపై నిషేధం కొనసాగుతుంది. కాగా ఉపాధ్యాయులు మాత్రం ఈ బదిలీ ఉత్తర్వుల పరిధిలోకి రారు. ఇదిలా ఉంటే ఎన్నికలకు ముందు ఎన్నికల నిబంధనల్లో భాగంగా రెవెన్యూ అధికారులు, ఎంపీడీఓలు బదిలీలకు నోచుకోగా, ఇటీవలే వారిని తిరిగి పూర్వపు స్థానాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చిన విషయం పాఠకులకు తెలిసిందే.

డివైడర్‌ను దాటి.. ముగ్గురిని ఢీకొట్టి

- బైక్‌లను ఢీకొన్న వ్యాన్
- ఒకరికి తీవ్ర గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం



చొప్పెల్లలో జాతీయ రహదారి వద్ద ప్రమాదానికి కారణమైన వ్యాన్


ఆలమూరు: ఓ వ్యాన్ డివైడర్‌ను దాటొచ్చి రెండు బైక్‌లను ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. జాతీయ రహదారిలోని చొప్పెల్ల వద్ద శనివారం ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చొప్పెల్లకు చెందిన ఆకులు వెంకన్న (45), అడబాల సత్యనారాయణ (57)లు ఓ బైక్ వస్తుండగా, చిక్కిరెడ్డి రాజు (32) మరో బైక్‌పై ఆగి ఉన్నారు. వీరు వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్నారు. జొన్నాడ నుంచి రాజమహేంద్రవరం వైపు ఇటుక లోడుతో వెళ్తున్న వ్యాన్ ఇక్కడి కొండలమ్మ గుడి జంక్షన్‌కు వచ్చేసరికి అదుపు తప్పి డివైడర్ దాటుకుంటూ వచ్చి వీరి బైక్‌లను ఢీకొంది. అనంతరం మరో వాహనం దగ్గరకు వచ్చి ఆగింది. ఈ ప్రమాదంలో పై ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై ఎం.అశోక్ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వెంటనే హైవే, 108 అంబులెన్స్ సిబ్బంది వచ్చి క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో రెండు బైక్‌లూ నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముగ్గురిలో సత్యనారాయణ, వెంకన్న పరిస్థితి విషమంగా ఉందనే అభిప్రాయాన్ని వైద్యులు వ్యక్తం చేయడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మరో క్షతగాత్రుడు చిక్కిరెడ్డి రాజు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు చెప్పారు. వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఈ మేరకు ఆలమూరు ఎస్సై ఎం.అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో మహిళ మృతదేహం

- హత్యచేశారని పోలీసుల అనుమానం

ఏలేశ్వరం: మండలంలోని మద్రిపీడు గ్రామంలో ఏలేరు ప్రాజెక్టుకు వెళ్లే ప్రధాన కాలువలో శనివారం గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. మృతదేహానికి కాళ్లు, చేతులు, తల లేవు. దుండగులు హత్య చేసి కాలువలో పడేసి ఉంటారని భావిస్తున్నారు. ఉదయం కాలువ పక్కనుంచి వెళుతున్న మత్స్యకారులు నీటిలో తేలుతున్న మృతదేహాన్ని గుర్తించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మృతురాలి వయసు 30 నుంచి 35 ఏళ్లు ఉంటుందని, హత్య జరిగి వారం రోజులు అయ్యి ఉంటుందని భావిస్తున్నారు. మొండెం మాత్రమే లభ్యం కావడంతో కాలువ ఎగువ ప్రాంతాలైన అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల నుంచి కొట్టుకువచ్చిందా లేదా మైదాన ప్రాంతం నుంచి తీసుకువచ్చి ఇక్కడ పడేశారా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

వృద్ధుడి మృతి



కోట వెంకట్రావు (ఫైల్)

కాజులూరు: గొల్లపాలెంలోని కాజులూరు రోడ్ జంక్షన్‌లో శనివారం హెరిటేజ్ పాల వ్యాన్ సైకిల్‌ను ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఆర్యావటం శివారు ముత్తావారి గరువుకు చెందిన కోట వెంకట్రావు (70) ఐస్‌క్రీమ్ వ్యాపారం చేస్తూ జీవనోపాధి సాగిస్తున్నాడు. శనివారం ఉదయం తన సైకిల్‌పై గొల్లపాలెం నుంచి ఇంటికి వెళ్తుండగా కాజులూరు రోడ్ జంక్షన్‌లో ఎదురుగా వస్తున్న హెరిటేజ్ పాల వ్యాన్ ఢీకొంది. ఈ ఘటనలో వెంకట్రావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు వెంకట్రావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ కేసును గొల్లపాలెం ఎస్సై ఎం.తులసీరామ్ దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి మృతదేహం లభ్యం



నరేంద్ర మృతదేహం

కె.గంగవరం: కోటిపల్లిలోని గౌతమి గోదావరి నదిలో శుక్రవారం సాయంత్రం స్నానానికి దిగి కుందూల నరేంద్ర (25) గల్లంతయ్యాడు. రాత్రి నుంచి గజ ఈతగాళ్లతో స్థానిక పోలీసులు, రెవెన్యూ సిబ్బంది గాలింపు చర్యలు చేట్టారు. స్నానానికి దిగిన ప్రాంతానికి కూతవేటు దూరంలో శనివారం ఉదయం శవమై తేలాడు. వెంటనే గుర్తించిన ఈతగాళ్లు మృతదేహాన్ని గట్టుకు చేర్చారు. కె.గంగవరం పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే నరేంద్ర మృతితో ద్రాక్షారామ తోటపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. నరేంద్ర తల్లి ద్రాక్షారామలోని ప్రైవేట్‌గా ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది.

వ్యక్తి ఆత్మహత్య



ఏడుకొండలు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సురేష్‌బాబు

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కోణాల ఏడుకొండలు (43) తన ఇంట్లో ఈ నెల 16న రాత్రి ఉరివేసుకుని మృతి చెందాడు. మనస్పర్థల కారణంగా ఇటీవల అతని భార్య ధనలక్ష్మి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన ఏడుకొండలు తన ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. అతని కుమార్తె పావని ఫిర్యాదు మేరకు అంగర ఇన్‌చార్జి ఎస్సై సురేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.